సాక్షి విశాఖపట్నం

ఆదివారం। 23। మార్చి। 2025

మత్తులో పడితే జీవితాలు చిత్తు

- నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి





విద్యార్థులు, అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ఏయూ వీసీ రాజశేఖర్, డీసీపీలు 8లో

- నేత్రపర్వంగా శ్రీనివాస కల్యాణం 8లో



గురజాడ కళాక్షేత్రంలో జరిగిన శ్రీనివాస కల్యాణ మహోత్సవంలో భాగంగా నృత్య ప్రదర్శనకు విచ్చేసిన కళాకారులు..

- డీసీకి కలిసొచ్చేనా.? 8లో



ఎల్ఎస్‌జీ జట్టు ప్రాక్టీస్

క్రికెట్ అభిమానులకు శుభవార్త : విశాఖలోని స్టేడియంలో డిసెంబర్ 6న ఇండియా- దక్షిణాఫ్రికా మధ్య వన్డే మ్యాచ్ జరగనుంది.

రెచ్చిపోయిన ఆక్రమణదారులు

రెవెన్యూ సిబ్బందిపై దాడి

- సెల్‌ఫోన్లు లాక్కొని ధ్వంసం
- జేసీబీతో సహా డ్రైవర్‌పైకి బండరాళ్లు
- భయంతో పరుగులు తీసిన సిబ్బంది



తలయారి అప్పారావుపై దాడిచేస్తున్న ఆక్రమణదారులు

సబ్బవరం : **కూటమి ప్రభుత్వంలో భూ ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించేందుకు వెళ్లిన సబ్బవరం రెవెన్యూ సిబ్బందిపైన దాడి చేశారు. వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లను లాక్కొని నేలకేసి కొట్టారు. దీంతో** ప్రాణభయంతో రెవెన్యూ సిబ్బంది పరుగులు దీశారు. వివరాలు ఇలా ఉన్నాయి. సబ్బవరం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 271, 255లోని ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు తొలగించేందుకు శుక్రవారం సాయంత్రం రెవెన్యూ సిబ్బంది వెళ్లారు. సర్వే నంబర్ 271లో గెడ్డవాగులోని సుమారు 20 సెంట్లలో అక్రమంగా నిర్మించిన బేస్‌మెంట్, కాంపౌండ్ వాల్‌ను జేసీబీ సాయంతో



పొక్లెయిన్ సాయంతో అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఆర్ఐ వీరయ్యతో పాటు వీఆర్వోలు వినోద్, నూకరత్నం, తలయారి అప్పారావు తొలగిస్తుండగా ఆక్రమణదారులు అక్కడకు చేరుకున్నారు. వారితో వాగ్వాదానికి దిగి దుర్భాషలాడారు. వీఆర్వో వినోద్, తలయారి అప్పారావుపై దాడికి పాల్పడ్డారు. వారి **వద్ద గల సెల్‌ఫోన్లను లాక్కొని నేలకేసి కొట్టారు. జేసీబీతో పాటు ఆపరేటర్‌పై బండరాళ్లతో దాడికి పాల్పడ్డారు. దీంతో ప్రాణభయంతో రెవెన్యూ అధికారులు పరుగులు దీశారు. ఈ విషయమై తహసీల్దార్ చిన్నికృష్ణను వివరణ కోరగా దాడి జరిగిన మాట వాస్తవమేనన్నారు. వీఆర్వో వినోద్, తలయారి అప్పారావుపై ఆక్రమణదారులు గొర్లి** కుమారస్వామి, లగుడు సత్యనారాయణ, గొంప ముత్యాలనాయుడు, గొర్లి శ్రీనివాసరావు దాడి చేశారన్నారు. శుక్రవారం రాత్రి పోలీసులు విషయం తెలియజేశామని, శనివారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామని తహసీల్దార్ చెప్పారు. 24 గంటల్లో దాడికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించామన్నారు. కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.

న్యాయవాదుల సేవలు ఎంతో కీలకం

- న్యాయవాదులు, న్యాయమూర్తుల మధ్య సమన్వయం అవసరం
- రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ రఘునందన్ రావు



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రఘునందన్ రావుతో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బెవర సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు

విశాఖ లీగల్ : కేసులు సత్వర పరిష్కారానికి **న్యా**యవాదుల సేవలు ఎంతో కీలకమని రాష్ట్ర **హైకో**ర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ రఘునందన్ **రావు** అన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణం **లోని** న్యాయవాదుల గ్రంథాలయంలో ఆయన **న్యా**యవాదులను ఉద్దేశించి మాట్లాడారు. గత ఎన్నో **నెల**లుగా మూతబడిన న్యాయవాదుల ఫలహారశా**లను** తక్షణమే అందుబాటులోకి వచ్చే విధంగా **చర్య**లు చేపట్టాలని సంబంధిత అధికారులను **ఆదే**శించారు. అలాగే కొత్త, పాత న్యాయస్థానాలను కలుపుతూ బ్రిడ్జి నిర్మాణానికి సానుకూలంగా స్పందించారు. న్యాయవాదులకు అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చడంలో హైకోర్టు ముందు ఉంటుందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా న్యాయస్థానంలో మగ్గుతున్న కేసుల పరిష్కారానికి న్యాయవాదులు, న్యాయమూర్తుల మధ్య సమన్వయం అవసరం అన్నారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బెవర సత్యనారాయణ మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన హైకోర్టులో న్యాయమూర్తిని కలిసి తమ సమస్యలపై వినతి పత్రం అందించామన్నారు. న్యాయమూర్తి తక్షణమే స్పందించి సమస్యల పరిష్కారానికి ముందుకు వచ్చారని ఆనందం వ్యక్తం చేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్, పూర్వ ఉపాధ్యక్షుడు రామ యోగేశ్వరరావు, సభ్యులు పి.నరసింగరావు, బైపా అరుణ్ కుమార్, న్యాయవాదుల సంఘం కార్యదర్శి డి.నరేష్, సంఘం నాయకులు గోలి శ్రీనివాసరావు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

రుషికొండ బీచ్‌కు బ్లూ ఫ్లాగ్ పునరుద్ధరణ



బ్లూ ఫ్లాగ్‌ను కలెక్టర్‌కు అందజేస్తున్న బ్లూ ఫ్లాగ్ ఇండియా జాతీయ ఆపరేటర్ డాక్టర్ జీత్ కురుప్

మహారాణిపేట: రుషికొండ బీచ్‌కు బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్‌ను ఎట్టకేలకు పునరుద్ధరించారు. రుషికొండ బ్లూ ఫ్లాగ్ బీచ్‌పై విధించిన తాత్కాలిక సస్పెన్షన్‌ను ఎత్తివేస్తున్నట్లు బ్లూ ఫ్లాగ్ ఇండియా అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా శనివారం బ్లూ ఫ్లాగ్ ఇండియా జాతీయ ఆపరేటర్ డాక్టర్ జీత్ కురూప్, బ్లూ ఫ్లాగ్ ఇండియా జ్యూరీ సభ్యుడు అజయ్ సక్సేనా.. కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌కు బ్లూ ఫ్లాగ్‌ను అందజేశారు. పర్యావరణ పరిరక్షణ, నీటి నాణ్యత, భద్రతా ప్రమాణాలు, మెరుగైన మౌలిక సదుపాయా లు కల్పించడంతో మళ్లీ బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్ దక్కినట్లు జిల్లా పర్యాటక శాఖాధికారి సుధా సాగర్ తెలిపారు.

నిర్వహణను గాలికొదిలేయడంతో.. : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బ్లూఫ్లాగ్ నిర్వహణను గాలికొదిలేసింది. దీంతో ప్రపంచ స్థాయి బీచ్ అస్తవ్యస్తంగా మారిపోయిందని సందర్శకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ బ్లూఫ్లాగ్ ప్రతినిధులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన డెన్మార్క్ ప్రతినిధులు బీచ్‌ని సందర్శించి బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్‌ని తాత్కాలికంగా రద్దు చేశారు. దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. హడావుడిగా సౌకర్యాల పునరుద్ధరణ పనులు చేపట్టింది.

నగరానికి 24/7 డ్రోన్ రక్షణ

- నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి



డ్రోన్ శిక్షణను పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

అల్లిపురం: నగరంలో నేర నియంత్రణ కోసం డ్రోన్లు ఉపయోగించనున్నట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. అనుమానిత ప్రాంతాలతో పాటు బీచ్‌రోడ్డు, బీచ్‌ల్లో డ్రోన్లతో నిరంతర నిఘా ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వివరించారు. పాత్రా సంస్థ యాజమాన్యం సీఎస్ఆర్ భాగంగా అధునాతన డ్రోన్లు అందజేసిందని, వీటిపై పోలీస్ కమిషనరేట్ ఆర్మ్‌డ్ రిజర్వు గ్రౌండ్‌లో కానిస్టేబుల్స్‌కు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో పోలీస్ కమిషనర్ ఈ వివరాలు వెల్లడించారు.

డ్రోన్ ప్రత్యేకతలివీ..

ఈ డ్రోన్లు హెచ్చరికలు జారీ చేయడానికి లౌడ్ స్పీకర్లతో పాటు డే విజన్ కెమెరా 10 ఎక్స్ ఆప్టికల్ జూమ్, 112 ఎక్స్ డిజిటల్ జూమ్ కలిగి ఉంటాయి. అలాగే నైట్ విజన్ కెమెరా 10 ఎక్స్ ఆప్టికల్ జూమ్, 112 ఎక్స్ డిజిటల్ జూమ్, 45 నిమిషాల కంటే ఎక్కువ ఎగిరే సామర్థ్యం, 5 కిలోమీటర్ల పరిధిలో ఎగిరే విధానం, డే అండ్ నైట్ విజన్ సెన్సార్‌తో డీఆర్ఐ (డిటెక్షన్, రికగ్నిషన్, ఐడెంటిఫికేషన్), ఆర్‌టీహెచ్ (రిటర్న్ టు హోమ్), లైవ్ స్ట్రీమింగ్ కనెక్టివిటీ, సెర్చ్‌లైట్ వంటి ప్రత్యేకతలు ఉన్నాయి. విశాఖలో ప్రతి అడుగునా పోలీసు ఉండాలి లేదా డ్రోన్ నిఘా ఉంచాలనేది లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సీపీ అన్నారు. ప్రధాన కార్యక్రమాల్లో వీటిని ఉపయోగించి రక్షణ కల్పించనున్నట్లు ఆయన వివరించారు.

క్షయవ్యాధిని పూర్తిగా నిర్మూలించాలి



ప్రసంగిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు అంతా కలిసికట్టుగా ఉద్యమించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అన్నారు. శనివారం ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ నుంచి జిల్లా పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి సోకిన వారి పట్ల వివక్ష చూపరాదన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ క్షయ వ్యాధి మందుల ద్వారా పూర్తిగా నయమవుతుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,456 కేసులు నమోదయ్యాయని, వీరికి మందులను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ కుమార్, జిల్లా క్షయ నివారణ అధికారి డా.ఎన్.పూర్ణేంద్రబాబు, ప్రోగ్రాం అధికారులు, టీబీ, లెప్రసీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 33.2 లక్షలు సి.ఎస్.ఆర్. యాక్టివిటీ ద్వారా బహుకరించిన నాల్కో కంపెనీకి కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. నాల్కో కంపెనీ సహాయంతో 927 మంది టీ.బీ.రోగులకు ఫుడ్ ప్యాకెట్స్ అందజేశారు.

విశాఖ వాసికి బిల్ గేట్స్ ప్రశంస

- ఎన్‌లైట్-360 పరికరం పరిశీలన



ఎనలైట్-360 పరికరాన్ని పరిశీలిస్తున్న బిల్‌గేట్స్

అక్కిరెడ్డిపాలెం: అప్పుడే పుట్టిన శిశువుల్లో వచ్చే పచ్చకామెర్ల నివారణకు వినియోగించే ఎనలైట్-360 పరికరాన్ని గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ పరిశీలించారు. అక్కిరెడ్డిపాలేనికి చెందిన ఎం.సుబ్రహ్మణ్యప్రసాద్ ఈ పరికరాన్ని తయారు చేశారు. దీనిని దేశ రాజధానిలో జరిగిన కార్యక్రమంలో ప్రదర్శించగా.. బిల్ గేట్స్ ఎంతో ఆసక్తిగా పరిశీలించారు. పరికరం తయారుచేసిన ప్రసాద్‌ను అభినందించారు. ఈ పరికరం తయారీతో నూతన ఆవిష్కరణలకు అందించే ప్రతిష్టాత్మక ఆరోహణ్ సోషల్ ఇన్నోవేషన్ అవార్డు 2023ను ప్రసాద్ ఇప్పటికే సాధించారు.

కార్మికులకు బీమా, భద్రతా శిక్షణ తప్పనిసరి

- కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలకు పెద్దపీట వేయాలని, తరచూ మాక్ డ్రిల్స్ నిర్వహించి కార్మికులు, ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆదేశించారు. పరిశ్రమల్లో పనిచేసే సిబ్బందికి ప్రమాదాల నుంచి తప్పించుకోవడం ఎలా అనే అంశంపై శిక్షణ ఇప్పించాలన్నారు. కలెక్టరేట్‌లో శనివారం వివిధ విభాగాల అధికారులు, పరిశ్రమల నిర్వాహకులతో కూడిన జిల్లా క్రైసిస్ మేనేజ్‌మెంట్ గ్రూప్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా కంపెనీల్లో పని చేసే సిబ్బందికి, కార్మికులకు తప్పనిసరిగా బీమా పాలసీ చేయించాలన్నారు. పరిశ్రమల్లో పాటించాల్సిన భద్రతా ప్రమాణాలపై పలు మార్గదర్శకాలు జారీ చేశారు. అన్ని చోట్లా ఆటోమెటిక్ అలారం మెకానిజం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెండు కిలోమీటర్ల పరిధి వరకు ప్రమాద జోన్‌గా గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయా పరిశ్రమల్లో పనిచేసే సిబ్బందిని, చుట్టుపక్కల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. అన్ని చోట్లా ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లను నిత్యం అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ఫ్యాక్టరీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ సురేష్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆదిశేషు, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

తుక్కు దొంగ హత్య కేసులో వీడిన మిస్టరీ

దాదాపు నాలుగేళ్ల కిందట..

2021 ఏప్రిల్ 22 తెల్లవారుజామున 5 గంటల సమయంలో కంచరపాలెం మెట్టు, పైడిమాంబ గుడి సమీపంలో ఓ వ్యక్తి దారుణంగా హత్యకు గురయ్యాడు. అతని మర్మాంగాలు కోసి రైల్వే గోడ వెనుక పడేశారు. 112కు వచ్చిన కాల్ ఆధారంగా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడు గనగళ్ల శ్రీనుగా గుర్తించారు. మృతుడి అన్న కొడుకు గనగళ్ల ధనరాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే ఈ కేసులో ఆధారాలు లభించకపోవడంతో 'అన్ డిటెక్టబుల్'గా ట్రీట్ చేస్తూ 2022 ఆగస్టులో మూసివేశారు.

ప్రస్తుతం..

అన్ డిటెక్టబుల్ కేసులపై దృష్టి పెట్టిన నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఈ కేసును రీ ఓపెన్ చేయించారు. పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కె.హుస్సేన్ ఆధ్వర్యంలో ఏడుగురితో టీమ్ ఏర్పాటు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. దర్యాప్తు బృందం కేసు టేకప్ చేసిన పది రోజుల్లోనే ఛేదించింది. శ్రీనును హత్య చేసిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీపీ తెలిపారు. నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు.

- నాలుగేళ్ల కిందటి కేసును 10 రోజుల్లో ఛేదించిన పోలీసులు
- ఇద్దరు నిందితుల అరెస్ట్.. ఇద్దరూ పాత నేరస్తులే
- సీపీ అభినందనలు అందుకున్న దర్యాప్తు బృందం

అల్లిపురం: స్క్రాప్ వ్యాపారంలో నెలకొన్న వివాదాలే గనగళ్ల శ్రీను హత్యకు ప్రధాన కారణమని దర్యాప్తులో తేలింది. పోలీసులు కొబ్బరితోట, భూపేష్‌నగర్, అల్లిపురం, రైల్వే క్వార్టర్స్, జ్ఞానాపురం, కంచరపాలెం తదితర ప్రాంతాల్లో గాలించి, 28 మంది తుక్కు దొంగలు, వ్యాపారులు, రౌడీలు, 35 మంది హిజ్రాలను విచారించారు. దర్యాప్తులో మృతుడు శ్రీనుకు మరో తుక్కు దొంగ అయిన లాలం గణేష్‌తో తీవ్రమైన గొడవలు ఉన్నట్లు గుర్తించారు. శ్రీను తమ్ముడు తోటయ్య ఒక సెల్‌ఫోన్‌ను దొంగలించి లాలం గణేష్‌కు అమ్మగా, ఆ ఫోన్‌ను గణేష్ తమ్ముడు శ్రీను వాడుతున్నాడు. ఈ విషయంలో తోటయ్యను గోపాలపట్నం క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. బెయిల్ కోసం రూ.10 వేలు ఖర్చు అయ్యాయని, తన తమ్ముడు పోలీసులకు దొరికిపోవడానికి గణేష్, శ్రీనులే కారణమని శ్రీను భావించాడు. ఆ బెయిల్ ఖర్చుల ఇవ్వాలని లాలం గణేష్‌ను శ్రీను వేధించేవాడు. 2021 ఏప్రిల్ 16న సాయి స్క్రాప్ దుకాణం వద్ద శ్రీను, అతను తోడు దొంగ అయిన కల్యాణ్‌లు కలిసి గణేష్ వద్ద బలవంతంగా రూ.4 వేలు తీసుకున్నారు. దీంతో గణేష్ కోపంతో ఊగిపోయాడు. 21న గణేష్, కొమర తారకేశ్వరరావులు తాము దొంగతనం చేసిన రాగిని స్క్రాప్ షాప్‌లో అమ్ముతున్నారు. అదే సమయంలో శ్రీను, కల్యాణ్‌లు తాము దొంగతనం చేసిన స్టీల్‌ను అమ్మడానికి అక్కడికి వచ్చారు. ఈ క్రమంలో మళ్లీ డబ్బు విషయంలో గొడవ జరగడంతో శ్రీను, కల్యాణ్ చాకులు తీసి గణేష్, తారకేశ్వరరావులపై దౌర్జన్యం చేశారు. ఆ సమయంలో స్క్రాప్ షాప్ యజమాని సాయికృష్ణ, ఆటో డ్రైవర్ పుక్కళ్ల నరసింగరావు వారిని కాపాడారు. శ్రీను, కల్యాణ్‌లను అక్కడ నుంచి కొట్టి పంపించేశారు. ఆ తర్వాత లాలం గణేష్.. నరసింగరావు వద్ద శ్రీను బతకనివ్వడురా.. ఏదో ఒకటి చేయాలి రా అని చెప్పాడు. అదే రోజు రాత్రి ఒంటి గంట సమయంలో నరసింగరావు ఆటోలో గణేష్, తారకేశ్వరరావులు పోర్టు నుంచి రెండు రాగి బండిల్స్‌ను స్క్రాప్ దుకాణం వద్ద తీసుకొచ్చారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల అనంతరం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో పైడి తల్లమ్మ ఆలయానికి సమీపంలో పెంద్రరాము స్క్రాప్ షాప్ వద్ద శ్రీను వారికి ఒంటరిగా ఎదురుపడ్డాడు. వెంటనే గణేష్, తారకేశ్వరరావు ఆటో దిగి శ్రీనుతో గొడవపడ్డారు. గణేష్ రాయి తీసుకొని శ్రీను తలపై కొట్టగా, తారకేశ్వరరావు అతని చేతులు పట్టుకున్నాడు. లాలం గణేష్ తన వద్ద ఉన్న చిన్న కత్తితో శ్రీను మర్మాంగాన్ని కోసి రైల్వే గోడ వెనుక పడేశాడు. అనంతరం అచేతనంగా ఉన్న శ్రీనును పెంద్రరాము షాప్ వద్ద చెట్టు కిందకు ఈడ్చుకెళ్లారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని నరసింగరావును బెదిరించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ మేరకు పోలీసులు సాక్ష్యాధారాలు సేకరించి అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం జంగవానిపాలేనికి చెందిన లాలం గణేష్‌ను, పెదగంట్యాడకు చెందిన కొమర తారకేశ్వరరావును అరెస్ట్ చేశారు. నేరస్థలంలో సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసిన అనంతరం వారిని రిమాండ్‌కు తరలించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

మృతుడు, నిందితులపై పలు కేసులు

శ్రీనుపై హార్బర్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్, టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్‌లు ఉన్నాయి. నిందితుడు లాలం గణేష్‌పై అనకాపల్లి జిల్లా, అచ్యుతాపురంలో మూడు దొంగతనం కేసులు, చోడవరంలో సెక్యూరిటీ కేసు, రాంబిల్లి పోలీస్ స్టేషన్‌లో ఓ కేసు, నగరంలో సెక్యూరిటీ కేసు, దొంగతనం కేసు నమోదయ్యాయి. తారకేశ్వరరావుపై శ్రీకాకుళం జిల్లాలో దొంగతనం కేసు, న్యూ పోర్టు పోలీస్ స్టేషన్‌లో రెండు దొంగతనం కేసులు, స్టీల్‌ప్లాంట్ పీఎస్‌లో రెండు దొంగతనం కేసులు, న్యూపోర్టు పోలీస్ స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్ ఉన్నాయని సీపీ తెలిపారు.

సిబ్బందికి సీపీ అభినందనలు

కేసును 10 రోజుల్లో ఛేదించిన పీసీఆర్ సీఐ ఎస్.కె.హుస్సేన్, సీసీఎస్ ఏఎస్ఐ పి.చంద్రశేఖర్, ఎంఆర్ పేట హెచ్.సి డి.రమేష్‌రెడ్డి, కంచరపాలెం హెచ్‌సీ ఆదిరెడ్డి అర్జున్, ఎంఆర్‌పేట కానిస్టేబుల్ ఎస్.ఎ.రాజు, టూటౌన్ కానిస్టేబుల్ ఎ.వినోద్, త్రీ టౌన్ కానిస్టేబుల్ వి.రామరాజులను పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అభినందించి, ప్రశంసాపత్రాలు అందజేశారు.

డీసీకి కలిసొచ్చేనా.?

- భారత్ జట్టుకు అచ్చొచ్చిన వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియం
- ఐపీఎల్‌లో చతికిలపడుతున్న ఆతిథ్య జట్లు
- రేపు ఎల్ఎస్‌జీ, డీసీ తొలి మ్యాచ్





విశాఖ స్పోర్ట్స్: పీఎంపాలెంలోని వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియం భారత్‌కు అచ్చివచ్చిన వేదికగా పేరుగాంచింది. 2009 తర్వాత వైఎస్సార్ స్టేడియంగా మారిన ఇక్కడ భారత్ అనేక అంతర్జాతీయ విజయాలు సాధించింది. 2016లో అయితే మూడు ఫార్మాట్లలోనూ(టెస్ట్, వన్డే, టీ20) ప్రత్యర్థులను 3-0తో ఓడించి రికార్డు సృష్టించింది. అయితే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) విషయానికి వస్తే ఈ స్టేడియం ఆతిథ్య జట్టుకు అంతగా కలిసిరావడం లేదు. ఇక్కడ జరిగిన పది ఐపీఎల్ మ్యాచ్‌ల్లో ఆరు మ్యాచ్‌ల్లో ఆహ్వాన జట్లే విజయం సాధించాయి. న్యూట్రల్ గ్రౌండ్‌గా ఇక్కడ రెండు మ్యాచ్‌లు జరిగాయి. రాష్ట్రానికి సొంత ఫ్రాంచైజీ లేకపోయినా.. ఈ స్టేడియం పలు జట్లకు హోం గ్రౌండ్‌గా వ్యవహరిస్తోంది. 2012లో తొలిసారిగా డెక్కన్ చార్జర్స్ జట్టు హోం గ్రౌండ్‌గా మ్యాచ్ ఆడింది. ఈ మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ విజయం సాధించింది. 2015లో డెక్కన్ చార్జర్స్ పేరు సన్‌రైజర్స్ హైదరాబాద్‌గా మారి ఇక్కడ మ్యాచ్ ఆడింది. ఈసారి రాజస్థాన్ రాయల్స్ చేతిలో పరాజయం పాలైంది. 2016లో ముంబై ఇండియన్స్, రైజింగ్ పూణే సూపర్ జెయింట్స్ జట్లు ఇక్కడ మూడేసి మ్యాచ్‌లు ఆడాయి. 2019లో ప్లేఆఫ్ మ్యాచ్‌లకు కూడా ఆతిథ్యం ఇచ్చింది. 2024లో ఢిల్లీ క్యాపిటల్స్(డీసీ) ఈ స్టేడియాన్ని తమ రెండో హోమ్ గ్రౌండ్‌గా ఎంచుకుంది. అయితే ఇక్కడ ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఒక విజయం, ఒక ఓటమిని చవిచూసింది. విశేషం ఏమిటంటే ఇక్కడ విజయం సాధించిన కోల్‌కతా నైట్‌రైడర్స్ గత సీజన్‌లో చాంపియన్‌గా నిలిచింది. డీసీ ప్రస్తుత సీజన్‌లో తమ తొలి రెండు మ్యాచ్‌లను ఇక్కడే ఆడనుంది. డీసీకి ఈ స్టేడియం హోమ్ గ్రౌండ్ కంటే ఆహ్వాన జట్టుగానే కలిసి వచ్చింది. గతంలో ఆహ్వాన జట్టుగా ఇక్కడ ముంబై ఇండియన్స్, రైజింగ్ పూణే సూపర్ జెయింట్స్‌పై విజయాలు సాధించింది. 2019లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టును ఓడించి క్వాలిఫైయిర్ ఆడింది. ఈ సీజన్‌లో డీసీ తమ తొలి మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌తో తలపడనుంది. ఈ రెండు జట్లు శనివారం నెట్స్‌లో ప్రాక్టీస్ చేయగా సోమవారం రాత్రి 7.30 గంటలకు సీజన్ తొలి బంతిని ఎదుర్కోనున్నాయి.

మత్తులో పడితే జీవితాలు చిత్తు

ఏయూక్యాంపస్: మత్తు పదార్థాలకు బానిసలైతే భవిష్యత్తు అంధకారమవుతుందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి హెచ్చరించారు. నగర పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో 'నవ సమాజ నిర్మాణం' అనే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సరదాగా మొదలుపెట్టిన మత్తు పదార్థాల వినియోగం వ్యసనంగా మారుతుందన్నారు. మాదక ద్రవ్యాలు వ్యక్తి మానసిక, శారీరక ఆరోగ్యంపై తీవ్రమైన దుష్ప్రభావాలు చూపుతాయని తెలిపారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని, ఇందులో యువత భాగస్వామ్యం కూడా అవసరమన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయం, రవాణా జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే తనకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి సాంకేతిక ఉపయోగించాలని, దానిని దుర్వినియోగం చేయరాదన్నారు. విద్యావంతులు సైతం సైబర్ నేరాల బారిన పడుతున్నారన్నారు. యువత మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని సూచించారు. సమాజ నిర్మాణానికి సమయాన్ని సద్వినియోగం చేయాలన్నారు. మన ఆలోచన శక్తిని హరించే శక్తి సెల్‌ఫోన్‌కి ఉందని, దానికి వీలైనంత వరకు దూరంగా ఉండే ప్రయత్నం చేయాలన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వివిధ మేధో పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎస్.హరనాథ్, డీసీపీలు మేరీ ప్రశాంతి, కృష్ణ కాంత్ పటేల్, పలువురు ఏసీపీలు, ఏయూ విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై పోరాటాన్ని వేగవంతం చేయాలి

మహారాణిపేట: క్యాన్సర్‌పై పోరాటాన్ని వేగవంతం చేసి.. అంతర్జాతీయ సహకారం, పరిశోధన, పురోగతికి బలమైన వేదికగా నిలబడాలని ఒమేగా క్యాన్సర్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బెల్లాల రవిశంకర్ ఆకాంక్షించారు. శనివారం విశాఖలోని ఓ హోటల్‌లో ఒమేగా క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో జరిగిన మాలిక్యులర్ ఆంకాలజీ సొసైటీ కాన్ఫరెన్స్-2025ను ఆయన జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలిక్యులర్ ఆంకాలజీ సొసైటీ అనేది క్యాన్సర్ బయాలజీని లోతుగా అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. కొత్త క్యాన్సర్ చికిత్సా విధానాలను అభివృద్ధి చేయడానికి అంతర్జాతీయ సంస్థ పరిశోధకులు, వైద్యులు, ఆరోగ్య సంరక్షణ నిపుణుల మధ్య సహకారాన్ని అందిస్తుందన్నారు. ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి మాట్లాడుతూ క్యాన్సర్ పరిశోధన, చికిత్సా విధానాల్లో నూతన ఆవిష్కరణలపై చర్చలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శిల్పా, డాక్టర్ ఎస్.రామకోటేశ్వరరావు, డాక్టర్ బి.వి.మాధవి తదితరులు పాల్గొన్నారు. ఆదివారం కూడా ఈ సదస్సు జరుగుతుంది. ఈ సదస్సులో 100 మందికి పైగా ప్రముఖులు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రఖ్యాత మాలిక్యులర్ ఆంకాలజీ నిపుణులు, వైద్యులు, పరిశోధకులు పాల్గొంటున్నారు. 'ప్రెసిషన్ మెడిసిన్ ద్వారా క్యాన్సర్ సంరక్షణలో విప్లవాత్మక మార్పులు' అనే ప్రధాన థీమ్‌తో ఈ ఏడాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఒమేగా క్యాన్సర్ ఆస్పత్రి ఎం.డీ.బి.రవిశంకర్

ప్రతి నీటి బొట్టును ఆదా చేద్దాం

- జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట : విశాఖ ప్రజలు ప్రతి నీటి బొట్టును ఆదా చేయాలని కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సూచించారు. శనివారం ఆయన 'ప్రపంచ జల దినోత్సవం' సందర్భంగా జీవీఎంసీ, రూరల్ వాటర్ సప్లయ్ అధికారులతో నీటి నిర్వహణపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ జలాలు అడుగంటకుండా ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణ, ఆదా చర్యలు చేపట్టాలని, ఇంటి నిర్మాణం చేసేటప్పుడు తప్పకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో రోడ్లు, ఇళ్ల నిర్మాణాల వల్ల వర్షం నీరు భూమిలోకి చేరడం లేదని, అందువలన భూగర్భ జలాలు అడుగంటుతున్నాయన్నారు. వాటర్ మీటర్లను అవకాశం ఉన్నంత వరకు ఎక్కువగా అమర్చాలని, దీని ద్వారా ప్రజలలో బాధ్యతాయుత నీటి నిర్వహణను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం అర్బన్‌లో 115 ఎల్‌పిసిడి, రూరల్‌లో 55 ఎల్‌పిసిడి తాగునీరు సప్లయ్ అవుతుందని, దీనిని అర్బన్‌లో 135 ఎల్‌పిసిడి, రూరల్‌లో 75 ఎల్‌పిసిడీలు తీసుకువెళ్లేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. వర్షపు నీరు సముద్రంలోనికి వృథాగా పోకుండా చర్యలు చేపట్టేందుకు ఏయూ ప్రొఫెసర్, ఎన్జీవోస్ నివాస సంక్షేమ సంఘం సభ్యులు, వాటర్ మేనేజ్‌మెంట్, రైన్ వాటర్ హార్వెస్టింగ్‌పై చాలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అలాగే మిగతా కాలనీల్లో సొసైటీ సభ్యులు ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని నివాసిత సంక్షేమ సంఘాలకు, ఎన్జీవోలకు విజ్ఞప్తి చేశారు. జీవీఎంసీ పరిధిలో 50 నీటిమడుగులను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఇటీవల కేంద్ర నీటిపారుదల, విద్యుత్తు బోర్డు ఆధ్వర్యంలో జీవీఎంసీ నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడంలో ప్రతిభ కనబరిచినందుకు పురస్కారం కూడా అందించారని తెలిపారు. తాగునీటి విభాగం పర్యవేక్షక ఇంజనీరు రాజేంద్ర కృష్ణ, రూరల్ తాగునీటి విభాగం పర్యవేక్షక ఇంజనీరు కె.వెంకట చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఫోన్ కాల్

- మనస్తాపంతో మహిళ ఆత్మహత్య



రాజేశ్వరి(ఫైల్)

భీమునిపట్నం: భీమిలి సమీప గొల్లలపాలెంలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. తన భర్తకు ఎందుకు ఫోన్ చేశావని అతని భార్య ఓ మహిళను దుర్భాలాడడంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో ఆమె బంధువులు శనివారం భీమిలి పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. వివరాలివి.. భీమిలి సమీపంలోని గొల్లలపాలెంలో నివాసం ఉంటున్న గుడ్డాల సురేష్‌కు శుక్రవారం అదే గ్రామానికి చెందిన పీతల రాజేశ్వరి(28) సెల్ నుంచి కాల్ వచ్చింది. ఆ ఫోన్ కాల్‌ను సురేష్ భార్య ఉజ్వల లిఫ్ట్ చేసి, నా భర్తకు ఎందుకు ఫోన్ చేశావని ఆమెను ప్రశ్నించింది. పొరపాటున కాల్ వచ్చిందని రాజేశ్వరి చెప్పినప్పటికీ.. ఉజ్వల ఆమెను తీవ్ర పదజాలంతో దూషించింది. మనస్తాపంతో రాజేశ్వరి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆమెను ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన రాజేశ్వరి బంధువులు, ఉజ్వలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ భీమిలి పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ ఘటనపై స్పందించిన సీఐ బి.తిరుమలరావు.. ఉజ్వలతో పాటు ఆమె భర్త సురేష్‌ను కూడా అరెస్టు చేసినట్లు తెలిపారు. ఉజ్వల ఫోన్‌లో తీవ్రంగా దూషించడం వల్లే రాజేశ్వరి ఆత్మహత్యకు పాల్పడిందని ఆయన పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రాజేశ్వరికి ఇద్దరు పిల్లలు ఉండగా, ఆమె భర్త ముఠా కూలీగా పనిచేస్తున్నారు.

అప్పన్న భక్తులకు మజ్జిగ, పాలు

సింహాచలం: వేసవిని దృష్టిలో ఉంచుకుని సింహగిరికి వచ్చే భక్తులకు దర్శన క్యూల్లో మజ్జిగ అందిస్తామని దేవస్థానం ఈవో కె.సుబ్బారావు తెలిపారు. చిన్నారులకు పాలు అందిస్తామన్నారు. సింహగిరిపై శనివారం క్యూల్లో వేచి ఉన్న భక్తులకు ఈవో స్వయంగా మజ్జిగ, చిన్నారులకు పాలు అందించారు.

పేదరిక నిర్మూలనకు పి-4 విధానం దోహదం


మహారాణిపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పి-4 (పబ్లిక్, ప్రైవేటు, పీపుల్స్, పార్టనర్ షిప్) విధానం పేదరిక నిర్మూలనకు దోహదపడుతుందని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ రైతు సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, వ్యాపార సంఘాల ప్రతినిధులు, అధికారులతో కలిసి శనివారం కలెక్టరేట్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి-4 విధానం ద్వారా పేదరిక నిర్మూలన సాధ్యపడుతుందని, అందరూ దీని ఆవశ్యకతను తెలుసుకొని భాగస్వామ్యం కావాలని సూచించారు. చిన్న, సన్నకారు రైతులకు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు, చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహించుకునే వారికి, ఔత్సాహికులకు ఈ విధానం ద్వారా తగిన సాయం అందుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని ఔత్సాహికులను గుర్తించి దానికి తగ్గ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మత్స్యకారులు ఉత్పత్తులను అమ్ముకునేందుకు సదుపాయం కల్పించాలని, చేపల వేటలో వినియోగించే పాత వలల సేకరణకు హార్బర్ ప్రాంతంలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో సీపీవో శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, సచివాలయాల కోఆర్డినేటర్ ఉషారాణి, వ్యవసాయ అధికారి అప్పలస్వామి, మత్స్యశాఖ జేడీ లక్ష్మణ రావు, పరిశ్రమల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం: సామర్లకోట-పిఠాపురం-గొల్లప్రోలు, రావికంపాడు సెక్షన్‌లో జరుగుతున్న భద్రతా పరమైన ఆధునీకీకరణ పనుల నిమిత్తం ఆయా తేదీల్లో పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఆదివారం గుంటూరు-విశాఖపట్నం(17239) సింహాద్రి ఎక్స్‌ప్రెస్, సోమవారం కాకినాడ-విశాఖపట్నం(17267) మెము ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-కాకినాడ(17268) మెమో ఎక్స్‌ప్రెస్, రాజమండ్రి-విశాఖపట్నం(67285) మెము పాసింజర్, విశాఖపట్నం-రాజమండ్రి(67286) మెము పాసింజర్, విశాఖపట్నం-గుంటూరు (22875)ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, గుంటూరు-విశాఖపట్నం(22876)ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-గుంటూరు(17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్, గుంటూరు-విశాఖపట్నం (17239)సింహాద్రి ఎక్స్‌ప్రెస్, మంగళవారం విశాఖపట్నం-గుంటూరు(17240)సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దయ్యాయని పేర్కొన్నారు.

అంగరంగ వైభవంగా శ్రీనివాస కల్యాణం

బీచ్‌రోడ్డు: సాగరతీరంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. గురజాడ కళాక్షేత్రంలో శ్రీ వెంకటన్నమాచార్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం శ్రీనివాస కల్యాణం కనులపండువగా జరిగింది. శ్రీ సీతారామ చార్యుల ప్రవచనం, గోవింద నామస్మరణతో కళాక్షేత్రం మార్మోగింది. భక్తి మార్గంలో అన్నమయ్య సేవకు అంకితమైన మహిళలను గౌరవించాలనే ఉద్దేశంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ట్రస్ట్ ఈ విశిష్ట కార్యక్రమం నిర్వహించింది. ఇందులో భాగంగా వివిధ రంగాల్లో విశేష సేవలందించిన ఐదుగురు మహిళలకు అన్నమయ్య విశిష్ట సేవ పురస్కారాలు అందజేశారు. కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఈవో శోభారాణి, ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సంధ్యాదేవి, వుమెన్ చైల్డ్ వెల్ఫేర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జయదేవి, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి ఉషశ్రీ, సరిపల్లి భాస్కరమ్మ ఈ పురస్కారాలు అందుకున్నారు. ట్రస్ట్ చీఫ్ డైరెక్టర్ సునీత కొటారిని విశిష్ట సేవ రత్న బిరుదుతో అన్నమయ్య 12వ తరం వారసులైన శ్రీ తాళ్లపాక స్వామి దంపతులు సత్కరించారు. అనంతరం మహిళలకు ఆటల పోటీలు, బహుమతి ప్రదానోత్సవాలు నిర్వహించారు. అన్నమయ్య సేవకు సహకరిస్తున్న దాదాపు 300 మంది టీమ్ లీడర్లను కూడా ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో మానేపల్లి లక్ష్మి, విజయ, నాగలక్ష్మి, సుమ తదితర టీమ్ లీడర్లు సహకరించారు. కార్యక్రమానికి సహకరించిన దాతలను శ్రీ తాళ్లపాక స్వామీజీ సన్మానం చేశారు.



శ్రీనివాస కల్యాణం జరిపిస్తున్న శ్రీ వెంకటన్నమాచార్య సేవా ట్రస్ట్ ప్రతినిధులు